## క్లుప్తంగా

### రేపు ఎడ్లబళ్ల పోటీలు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం శివారు ఎరుకువాడ కొండ పక్కన వెలిసిన ఎరుకుమాంబ అమ్మవారి తీర్థం ఈ నెల 13న ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ తర్వాత 3 గంటల నుంచి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, నాలుగు, ఐదారు బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున అందిస్తామన్నారు.

### వెలవెలబోయిన వారపు సంత


బోసిపోయిన ప్రధాన రహదారి

మాకవరపాలెం: భానుడి ప్రతాపంతో వారపు సంత వెలవెలబోయింది. మాకవరపాలెంలో ప్రతి మంగళవారం జరిగే సంతకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులతోపాటు వ్యాపారులు పెద్ద ఎత్తున వస్తుంటారు. అయితే ఉదయం 10 గంటల అనంతరం ఎండ విజృంభించడంతో సంత అంతంతమాత్రంగానే సాగింది. సంత రోజున ఎంతో రద్దీగా ఉండే నర్సీపట్నం–విశాఖపట్నం ప్రధాన రహదారి భానుడి భగభగలకు సాయంత్రం 5 గంటల వరకు జన సంచారం లేకుండా ఖాళీగా దర్శనమిచ్చింది.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

- రూ.10 వేల అపరాధ రుసుం వసూలు

రావికమతం: ఎటువంటి అనుమతులు లేకుండా తరలుతున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావు మంగళవారం తెలిపారు. చినపాచిల శివారు గస్తీ నిర్వహిస్తుండగా అటుగా వేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను తనిఖీ చేశామన్నారు. పీపీ అగ్రహారానికి చెందిన సదరు ట్రాక్టర్ డ్రైవర్ జి.లోకేష్ వద్ద సంబంధిత పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి రూ.10 వేల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

### కె.కోటపాడు సీహెచ్‌సీలో సదరం క్యాంప్

- ప్రారంభించిన జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్


సదరం క్యాంప్‌లో దివ్యాంగురాలిని పరీక్షిస్తున్న ఆర్థోపెడిక్ డాక్టరు నందకిశోర్

కె.కోటపాడు: దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ కోసం స్థానిక సీహెచ్‌సీలోనే సదరం క్యాంప్‌ను జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు సదరం సర్టిఫికెట్ కోసం వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇకపై ఇక్కడే ఆర్థోపెడిక్ డాక్టర్ నిర్ధారణ ద్వారా సర్టిఫికెట్ మంజూరు కానుందన్నారు. ప్రతీ మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో సదరం క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి శ్రీలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి నందకిశోర్, కల్యాణి, పావని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### రైతుల సమక్షంలో సరిహద్దుల నిర్ధారణ


సరిహద్దుల ఏర్పాటు పనులపై సిబ్బందితో చర్చిస్తున్న ఆర్డీవో

మాకవరపాలెం: రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సర్వే సిబ్బందికి సూచించారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వే పూర్తయిన మాకవరపాలెంలో చేపట్టిన సరిహద్దు రాళ్ల ఏర్పాటు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దగ్గరుండి రాళ్లను ఏర్పాటు చేయించుకోవాలన్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దుల ఏర్పాటుకు 26 వేల రాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాదరావు, డీటీ కృష్ణమూర్తి, సర్వేయర్ శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రుత్తల సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

ఎమ్మెల్యే గణేష్ ఘన నివాళి


జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గణేష్


కె.కోటపాడులో పూలే చిత్రపటానికి పూలమాలను వేస్తున్న వెంకటేశ్వరరావు

నర్సీపట్నం: మహాత్మ జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కొనియాడారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు పాటుపడ్డారని కొనియాడారు. సంఘ సేవకు తన జీవితాన్ని ధారపోశారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, నర్సీపట్నం, గొలుగొండ ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, గజ్జలపు మణికుమారి, నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం పార్టీ మండలాల అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, పైల పోతురాజు, పార్టీ యూత్ అధ్యక్షుడు నానాజీ, నర్సీపట్నం, గొలుగొండ మండల సచివాలయ కన్వీనర్లు శానాపతి వెంకటరత్నం, ఫణికాంతరామ్, నాతవరం వైస్ ఎంపీపీ పైల సునీల్, నాయకులు ఆరుగుల్ల రాజుబాబు, ఇన్నం రమణ, శెట్టి నూకరాజు పాల్గొన్నారు.

**గౌతమి బుద్ధుడు, పూలే విగ్రహాల ఆవిష్కరణ**

నాతవరం: శృంగవరంలో మహాత్మ జ్యోతిరావు పూలే, గౌతమి బుద్ధుడు విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. మాజీ సర్పంచ్ కొండ్రు అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు, నాసా సంస్థ అధినేత సోనీవుడ్, విశ్రాంత ఇంజినీరు పైల అప్పలనాయుడు, నాసా సంస్థ మండల కన్వీనర్ తాటిపాక శ్రీను, దళిత సంఘం డివిజన్ మండల నాయకులు మహలక్ష్మి, మరిడియ్య, అజయ్‌బాబు, పాపారావు పాల్గొన్నారు.

**సంఘ సంస్కర్త పూలే**

కె.కోటపాడు: సమాజంలో కుల వివక్ష, అంటరానితనం రూపుమాపేందుకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. మంగళవారం కె.కోటపాడులో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఆమె ఘన నివాళులర్పించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు పూలే చిత్రపటానికి పూలమాల వేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీటీసీ లక్ష్మీ రమణమ్మ

రోలుగుంట: నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారంలోనూ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తనదైన ముద్ర వేసుకుంటున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల్లో అభిమానాన్ని చూరగొంటున్నారు. తాజాగా రోలుగుంటలో ఎంపీపీ ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ లక్ష్మీ రమణమ్మ, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీశ్రీనివాసరావులతో కలసి మంగళవారం ఆయన యాతవీధి, ఎరకుల కాలనీ, కొట్టే వీధి, దనిమిరెడ్డి వీధి, చాకలపేటలో ఇంటింటా తిరిగారు. ప్రజలను కలిసి వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. తాము ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా కావాల్సిన ధ్రువపత్రాలు తీసుకుని వలంటీర్లే సంక్షేమ పథకాలను మంజూరు చేయిస్తున్నారని, తమ ఇళ్లకు వచ్చి ఇస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా కాళ్లరిగేలా నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే సమస్య జగన్‌బాబు దయవల్ల తప్పిందన్నారు. దీనిలో భాగంగా ఇళ్లు లేని వారికి ఇళ్లు, కుళాయిలు ఏర్పాటు తదితర సమస్యలు గుర్తించి ఆయా శాఖల అధికారులకు వాటిని సిఫార్సు చేసి వెంటనే పరిశీలించి పరిష్కరించాలని విప్ ధర్మశ్రీ ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమరాన వెంటరమణ, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, యువజన మండల అధ్యక్షుడు మద్దు శివకుమార్, మాజీ ఉప సర్పంచ్ మద్దు తాతబాబు, కన్వీనర్ మద్దు రమణమ్మ, నాయకులు అల్లు ఎర్రినాయుడు, పిల్లి శ్రీను, బల్లా త్రినాథ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# మోడల్ నియోజకవర్గంగా మాడుగుల


దుశ్శాలువాతో మంత్రి బూడిని సత్కరిస్తున్న నాయకులు


దేవరాపల్లి పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల/దేవరాపల్లి/కె.కోటపాడు/చీడికాడ: నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడమే తన జీవిత ఆశయంగా పెట్టుకున్నానని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. బూడికి మంత్రి పదవి వరించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో సంబరాలు నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో కంటే ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎంపీపీ రామధర్మజ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మంత్రి ఓఎస్డీ ఎం. పోలినాయుడు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, పాల్గొన్నారు.

➡ దేవరాపల్లిలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, తదితరులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. పార్టీ మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

➡ కె.కోటపాడు మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి పాల్గొన్నారు.

➡ చీడికాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, విశాఖ డైయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

# వడ్డాది జంక్షన్‌లో ఆక్రమణల తొలగింపు


రోడ్డుపై ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలోని నాల్గు రోడ్ల జంక్షన్‌లో రోడ్డు ఆక్రమణలను పంచాయతీ అధికారులు తొలగించారు. ఇక్కడ ఆక్రమణలతో రోడ్డు ఇరుగ్గా ఉండటంతో గతంలో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడేవి. దాంతో ఇటీవల ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు చేయించారు. మురుగు బయటకు పోయేలా సిమెంట్ కాలువలు ఏర్పాటు చేసి విశాలంగా తారురోడ్డు ఏర్పాటు చేశారు. మరలా కొంతమంది వ్యాపారులు సిమెంట్ కాలువలపై పలకలు ఏర్పాటు చేసి రోడ్డుపైనే వాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో మరలా ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో పలువురు ఇటీవల పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై మంగళవారం పంచాయతీ ఈవో లోవరాజు, వీఆర్వో శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది కలిసి ఇక్కడ రోడ్డు ఆక్రమణలు తొలగించారు. ఇకపై కాలువ దాటి రోడ్డుపై వ్యాపారాలు చేస్తే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

### ఘనంగా పాదాలమ్మ తల్లి పండగ


మట్టి రోడ్డుపై వెళ్తున్న భక్తులు

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్వపల్లి పాదాలమ్మ తల్లి పండగను మంగళవారం శృంగవరం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఉలబాల శ్రీను, సర్పంచ్ ఉలబాల యర్రయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కాళ్ల పార్వతి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాళ్ల రమణ చొరవతో ఎమ్మెల్యే గణేష్ సహకారంతో రెండు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు.

# ఉపాధి వీఆర్పీలకు అపరాధ రుసుం


గ్రామాల్లో గుర్తించిన అంశాలను ప్రజావేదికలో వివరిస్తున్న ఎస్ఆర్పీలు

కె.కోటపాడు: గ్రామాల్లోని ఉపాధి హామీ పనుల్లో అవకతవకలను గుర్తించేందుకు ఏటా నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాలు దోహదపడతాయని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం కె.కోటపాడులో 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 32 పంచాయతీల్లో రూ.9.50 కోట్లతో చేపట్టిన 713 ఉపాధి పనులను పరిశీలించినట్లు ఎస్ఆర్పీ గోవింద్ తెలిపారు. ఈ పనుల సమయంలో రికార్డులు, మస్టర్ల నిర్వహణలో దిద్దుబాట్లు గుర్తించామన్నారు. కె.సంతపాలెం, గొట్లాం, గొండుపాలెం వీఆర్పీలకు రూ.2 వేలు అపరాధ రుసుం వేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్ అభివృద్ధి పనులకు రూ.5 కోట్లతో జరిగిన పనులను పరిశీలించామన్నారు. జెడ్పీటీసీ అనురాధ, డ్వామా అడిషినల్ పీడీ రోజారాణి, విజిలెన్స్ అధికారి నిర్మల, క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో శచీదేవి, ఏపీవో వసంత్ పాల్గొన్నారు.

### ఘనంగా గ్రామ దేవతల పండగలు


అమ్మవారిని దర్శించుకున్న ధర్మశ్రీ

రావికమతం: రావికమతం, తోటకూరపాలెం గ్రామాల్లో పరదేశమ్మతల్లి, చినపాచిల గ్రామంలో పైడితల్లమ్మతల్లి పండగలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి మంగళవారం ఉదయం నుంచి భక్తులు క్యూ కట్టారు. గ్రామంలో భారీ లైటింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తోటకూరపాలెంలో అమ్మవారిని దర్శించుకున్నారు. చినపాచిలలో ఏనుగు సెట్టింగ్ ఏర్పాటు చేసి పూజారి దానిపై ఊరేగడం ఆనవాయితీగా కొనసాగింది.

# భవన నిర్మాణ పనుల పూర్తికి చర్యలు

- కె.కోటపాడు సీహెచ్‌సీలో పనులను పరిశీలించిన డీఈ మధుసూదనరావు


నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ మధుసూదనరావు

కె.కోటపాడు: స్థానిక సీహెచ్‌సీలో అదనపు భవణాల నిర్మాణాలతోపాటు పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనను జూలై నెలాఖరు కల్లా పూర్తి చేస్తామని ఏపీఎంఎస్ఐడీసీ డీఈ మధుసూదనరావు తెలిపారు. ఇక్కడ ఆస్పత్రిలో రూ.5 కోట్లతో చేస్తున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలను పాటించి భవన నిర్మాణాలు చేస్తున్నామన్నారు. ఇవి పూర్తయితే కార్పొరేట్ స్థాయి వైద్యం అందనున్నట్లు వివరించారు. ఆయన వెంట ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఏఈ సంజయ్ నాయుడు ఉన్నారు.

# సభ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీపీ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట: సభ దృష్టికి వచ్చిన సమస్యలన్నీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, హౌసింగు ఏఈ ప్రేమానందం, వైద్యులు విమలగిరి, సునీత, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సూర్యామణి, ఏవో విజయలక్ష్మి తదితరులు తమ శాఖలపరమైన అభివృద్ధి గురించి మాట్లాడారు. ఇదే సమయంలో కొమరవోలు ఎంపీటీసీ రామన్, కుసుర్లపూడి సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, ఎస్.కొత్తూరు సర్పంచ్ రాజశేఖర్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల బిల్లులు చెల్లించాలని కోరారు. కొమరవోలు ఆవ కాలువ పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### ఎల్.బి.పట్నం సచివాలయ కన్వీనర్ తొలగింపు

చీడికాడ: ఎల్.బి.పట్నం గ్రామ సచివాలయం కన్వీనర్ పంచాడ సురేష్‌ను వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం తెలిపారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

# రూ.10 లక్షలతో పశువుల ఆస్పత్రి నిర్మాణం


ఆస్పత్రి నిర్మాణానికి కొలతలు తీస్తున్న ఇంజినీర్లు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో పశువుల ఆస్పత్రి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఇక్కడ పెంకులతో నిర్మించిన పురాతన పశువుల ఆస్పత్రి ఇటీవల వర్షాలకు కూలిపోయింది. దాంతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సూచనతో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందబాబు కొత్త ఆస్పత్రి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. మంగళవారం విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ ఏడీ చిన్నంనాయుడు, పశువైద్యాధికారి శివకుమార్‌ల సమక్షంలో డెయిరీ ఇంజినీర్లు కొలతలు తీశారు. నిధులు మంజూరు చేసిన విశాఖ డెయిరీ చైర్మన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు, పాడి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, నాయకుడు కోరుకొండ సూరి అప్పారావు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు


దాలివలసలో కరపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని 12వ వార్డు పెదబొడ్డేపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా పాల్గొన్నారు.

దేవరాపల్లి: జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా దేవరాపల్లిలో మంగళవారం రాత్రి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ప్రతి ఇంటికి వెళ్లారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వ ప్రగతిని వివరించారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, సచివాలయ కన్వీనర్లు గొర్రుపోటు రమాదేవి, గుల్లేపల్లి మురళీకృష్ణ, ఆతవ మహేష్, సోమిరెడ్డి పేరునాయుడు, మిడతాడ శ్రీను పాల్గొన్నారు.

కె.కోటపాడు: దాలివలసలో గ్రామ సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లతో కలిసి మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు ఇంటింటికీ వెళ్లారు. ఆయా కుటుంబాల అంగీకారంతో మిస్డ్ కాల్, ఇంటికి, సెల్‌ఫోన్‌కు స్టిక్కర్లను అంటించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

# న్యాయవాదుల విధుల బహిష్కరణ


బీఎన్ రోడ్డుపై న్యాయవాదుల ఆందోళన

చోడవరం రూరల్: దేశ రాజధాని న్యూఢిల్లీలో న్యాయ వాది దారుణ హత్యకు నిరసనగా చోడవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టుల విధులను బహిష్కరించి బీఎన్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ మాట్లాడుతూ న్యాయవాదిని హత్య చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి గొర్లె కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు ఎస్. నర్సింహారావు, కోశాధికారి ఆర్.ప్రసాదనాయుడు, మాజీ అధ్యక్షుడు పోతల ప్రకాష్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చర్యలు


రెవెన్యూ పరమైన వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఐ నాగరాజు

గొలుగొండ: వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. వైద్య పరంగా ప్రతి గ్రామంలో పేదలకు సేవలందించాలని సభ్యులు తెలిపారు. విద్యుత్ సేవలు సక్రమంగా అందలేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగులో ఉన్న ప్రతి ఒక్కరికీ సాగు పట్టాలు ఇవ్వడం జరుగుతుందని ఆర్ఐ నాగరాజు సభ్యులకు వివరించారు. వైస్ ఎంపీపీలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, పీఏసీఎస్ చైర్మన్ కిలపర్తి పెద్దిరాజు, ఎంపీడీవో డేవిడ్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే సేవలు


మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: సచివాలయ వ్యవస్థతో ఇంటి గుమ్మం వద్దకే పారదర్శకంగా సేవలందుతున్నాయని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. మంగళవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కృషి చేయాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్లు వినియోగించుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. ముందుగా మండలానికి మూడు డ్రోన్లు అందించనున్నట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఇంకా 1,600 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. జెడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, వైస్ ఎంపీపీలు ధర్మిశెట్టి స్వాతి, కిముడు చిన్నమ్మలు, ఎంపీడీవో జయప్రకాష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు అండగా మిషన్ వాత్సల్య

మాడుగుల: అనాథ పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం అండగా నిలుస్తుందని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. జేడీపేట గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15వ తేదీతో దరఖాస్తు గడువు పూర్తి కానుండటంతో ఈ పథకం లబ్ధికి అర్హులైన వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జేడీపేట, గాదిరాయి, గవరవరం గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.